ఈనాడు
బాపట్ల
శనివారం అక్టోబరు 12, 2024

జయ జయహే.. జగన్మాత



దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బాపట్ల పట్టణంలో అలంకరణలో అమ్మవారు - బాపట్ల, న్యూస్‌టుడే

దసరా వచ్చే.. వాహనం తెచ్చే..

విజయదశమి కలిసొస్తుందని విశ్వాసం

ఏటేటా పెరుగుతున్న కొనుగోళ్లు

బాపట్ల, న్యూస్‌టుడే

విజయదశమి రోజు కార్లు, ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసి దుర్గాదేవి పూజలు చేయిస్తే మేలు జరుగుతుందని, వాహనాలు విజయవంతంగా నడుస్తాయని అమ్మవారి భక్తుల విశ్వాసం. దీంతో దసరా వచ్చిందంటే వాహన కొనుగోళ్ల దుకాణాల వద్ద సందడి నెలకొంటుంది. ప్రజల సెంటిమెంటుకు తగినట్లుగా ద్విచక్ర వాహనాలు, కార్ల కంపెనీలు తమ దుకాణాల్లో పండగకు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించి కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారు. వాహనాలను పండగ రోజు డెలివరీ చేసేలా ముందుగా బుక్ చేసుకుంటున్నారు. ఏటేటా కొనుగోళ్ల సంఖ్య పెరుగుతూ వస్తుంది.

పండగకు కొత్త కారు కొనుగోలు చేసి ఆలయానికి తీసుకెళ్లి పూజలు చేయించి కుటుంబసమేతంగా వాహనంలో ప్రయాణించేందుకు ఆసక్తిచూపుతుంటారు. ఈ ఏడాది అక్టోబరు 3 నుంచి విజయదశమి ఆఫర్లను వాహన కంపెనీలు ప్రకటించాయి. పాత వాహనాలు తీసుకొని కొత్తవి తీసుకొనేలా ఎక్స్ఛేంజీ ఆఫర్లు, వాహనాల ధర డిస్కౌంట్లు ప్రకటిస్తూ దుకాణ యజమానులు ఆకట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారు. దసరా తొమ్మిది రోజుల పాటు వాహన కొనుగోళ్లకు సంబంధించి ఒప్పందాలు చేసుకొని పండగ రోజు డెలివరీ జరిగేలా చూసుకుంటారు. బ్యాంకులు నో కాస్ట్ ఈఎంఐల సౌకర్యం కల్పిస్తుండటంతో ఎలాంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండానే వాహనాలు బుక్ చేసుకుని పండగ రోజు తీసుకెళ్తున్నారు. మోటార్ సైకిళ్లు, స్కూటీలు, కార్లే కాకుండా వ్యాపారులు రవాణా ఆటోలు, మినీ లారీలు, లారీలు, టిప్పర్లు, ఆటోలు, భారీ వాహనాలను కొనుగోలు చేసి పూజలు చేయించడానికి సిద్ధమయ్యారు.

ఈ మూడేళ్లలో దసరా రోజు జిల్లాలో వాహన విక్రయాలు ఇలా..

సంవత్సరం	వాహనాలు
2022	1620
2023	1780
2024	2100

(కొనుగోలు చేస్తున్నవి సుమారుగా)



బాపట్లలో ఓ దుకాణంలో కొనుగోలుదారులకు ఇచ్చేందుకు సిద్ధం చేసిన వాహనాలు

దశమి వేడుకలకు పటిష్ఠ బందోబస్తు

బాపట్ల, న్యూస్‌టుడే: దసరా వేడుకల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఉత్సవాలు నిర్వహిస్తున్న ఆలయాలు, దుర్గాదేవి మండపాల వద్ద పోలీసు నిఘా ఏర్పాటు చేశామన్నారు. విజయాలకు చిహ్నమైన విజయదశమికి అన్ని రంగాల్లో అందరికీ విజయం చేకూరాలని, సుఖ సంతోషాలతో దసరా పర్వదినాన్ని ఆచరించాలన్నారు. జిల్లా ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బందికి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

మద్యం దుకాణాలకు 2 వేలకుపైగా దరఖాస్తులు

జిల్లాలో రూ.42.06 కోట్ల ఆదాయం

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో 117 మద్యం దుకాణాలకు రెండేళ్ల లైసెన్స్ కోసం మొత్తం 2103 దరఖాస్తులు వచ్చాయి. చివరి రోజు 648 దరఖాస్తులు అందాయి. శుక్రవారం రాత్రి ఏడు గంటలతో గడువు ముగిసింది. ఏడు గంటలలోగా డీడీలతో ఎక్సైజ్ స్టేషన్లకు వచ్చిన వారి నుంచి ఆ తర్వాత అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లో కలిపి అధికారుల అంచనాలకు అనుగుణంగా దరఖాస్తులు వచ్చాయి. చివరి రోజు వ్యాపారులు ఇప్పటి వరకు తక్కువ దరఖాస్తులు వచ్చిన దుకాణాలను ఎంపిక చేసుకొని పోటాపోటీగా వేశారు. ఒక్కో దరఖాస్తుకు రూ.రెండు లక్షల చొప్పున నాన్ రిఫండబుల్ రుసుం రూపంలో ప్రభుత్వానికి రూ.42.06 కోట్ల ఆదాయం వచ్చింది. జిల్లాలో అత్యధికంగా ఇంకొల్లు మండలంలోని 114 దుకాణానికి 47, 115, 113 దుకాణాలకు 45 చొప్పున దరఖాస్తులు వేశారు. ఈ మూడు దుకాణాలు దక్కించుకోవడానికి నాయకులు, వ్యాపారులు పోటీ పడ్డారు. ఒక్కో దుకాణానికి సగటున 18 దరఖాస్తులు చొప్పున వచ్చాయి. జిల్లా కేంద్రం బాపట్లలో అధికంగా ఐదో నంబరు దుకాణానికి 23 దరఖాస్తులు అందాయి.

15, 16 తేదీల్లో రెండో దశ వెబ్ ఆప్షన్లు

గుంటూరు, న్యూస్‌టుడే: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ (హానర్స్), బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల్లో 2024-25 ఏడాదిలో మిగిలిన సీట్లకు ప్రవేశాలకు రెండో దశ ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్లు ఈనెల 15, 16వ తేదీల్లో నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు angrau.ac.in ని చూడాలని సూచించారు.

మళ్లీ లీకుల గోల

వేల లీటర్ల నీరు వృథా

బాపట్ల, న్యూస్‌టుడే: పురపాలక రక్షిత నీటి పథకం పైప్‌లైన్ల లీకుల పరంపర మళ్లీ మొదలైంది. పట్టణంలోని ఏజీ కళాశాల వ్యవసాయ క్షేత్రం వద్ద ప్రధాన పైప్‌లైన్ దెబ్బతిని నీరు లీకవుతోంది. పట్టణంలోని లీకేజీల వల్ల రోజుకు 7వేల నుంచి 8వేల లీటర్ల నీరు వృథాగా పోతోంది. పురపాలక సంఘానికి రోజుకు రూ. వేలల్లో నష్టం వస్తోంది. తాగునీరు లీకు వల్ల శివారు కాలనీల్లో కుళాయిలకు నీరందటం లేదు. కొళాయిలకు చేతి పంపులు బిగించాల్సి వస్తోంది. సమస్యను ఏఈ ఉమామహేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా సత్వరమే మరమ్మతులు చేసి పైప్‌లైన్ నుంచి నీరు లీకు కాకుండా చర్యలు చేపడతామన్నారు.



ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే : హిందూ దేవాలయాలపై అధికారుల అజమాయిషీ కట్టడికి ప్రభుత్వం జీవో జారీ చేయడం హర్షణీయమని బాపట్ల జిల్లా అర్చక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి బృందావనం గోపీచంద్ అన్నారు. పిట్టలవానిపాలెం శ్రీరామాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

16లోగా ఈ- పంట జాబితా సరిచూసుకోండి

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో 2024 ఖరీఫ్ పంటకు సంబంధించి ఈ పంట నమోదు జాబితాలను ప్రదర్శనకు ఉంచామని మండల వ్యవసాయాధికారి టి.బాలాజీగంగాధర్ తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు ఉన్నా. నమోదులో లోటుపాట్లు గుర్తించినా ఈనెల 16లోపు సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి జాబితా సరిచూసుకోవాలని ఆయన కోరారు.

పల్లె పండగకు సర్వం సిద్ధం

వేమూరు, చెరుకుపల్లి, న్యూస్‌టుడే: ఈనెల 14 నుంచి ఆయా మండలాల్లోని పలు గ్రామాల్లో పల్లె పండగ నిర్వహించనున్నట్లు వేమూరు, చెరుకుపల్లి ఎంపీడీవోలు శివనారాయణ, నాగలక్ష్మి (ఇన్‌ఛార్జి) తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద రోడ్ల నిర్మాణానికి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తామన్నారు. వేమూరు మండలంలో 14న కుచ్చెళ్లపాడు, వెల్లబాడు, 15న పెరవలిపాలెం, పెరవలి, చావలి, 16న కోడిపర్రు, పెనుమర్రు, అబ్బనగూడవల్లి, 17న జంపని, పోతుమర్రు, వేమూరు, 18న బలిజేపల్లి, వరహాపురం, చెరుకుపల్లి మండలంలో 14న చెరుకుపల్లి, రాంభొట్లవారిపాలెం, కుంచలవారిపాలెం, 15న కావూరు, ఆరుంబాక, 16న ఆరేపల్లి, తూర్పుపాలెం, రాజోలు, 17న కనగాల, గూడవల్లి, ఆళ్లవారిపాలెం, 18న నడింపల్లి, గుళ్లపల్లి, 19న తుమ్మలపాలెం, బలుసులపాలెం గ్రామాల్లో కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

దీవెనలీయవా.. మోదుకూరు దుర్గమ్మా

చుండూరు, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల సందర్భంగా మండలంలోని మోదుకూరులో శ్రీకనకదుర్గమ్మ వార్షిక జాతరను భక్తులు వైభవంగా నిర్వహించారు. ఇక్కడ విజయదశమికి ముందు రోజు ఉత్సవాన్ని భారీగా నిర్వహిస్తారు. అమ్మవారి పుట్టిల్లు కందేపాడు నుంచి పసుపు, కుంకుమ, సారె చీర బండిపై తీసుకొచ్చి, దుర్గమ్మ ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం చేస్తారు. అనంతరం అదేరోజు అర్ధరాత్రి సమయంలో అమ్మవారికి కుంభం పోసి, గుడిని మూసేయడం ఆచారంగా వస్తోంది. అందులో భాగంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచే



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



జల్లిబుట్టలతో ప్రదక్షిణ చేస్తున్న బాలలు

అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు మొదలయ్యాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. విశేష పూజల అనంతరం అమ్మవారి కుంకుమ తీర్థప్రసాదాలందుకున్నారు.

జల్లి బుట్టలతో ప్రదర్శన.. మొక్కులున్నవారు నవధాన్యాల మొలకలతో కూడిన జల్లి బుట్టలు నెత్తిన పెట్టుకుని, మెడలో పిండి వంటల మాలను ధరించి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. చంటి బిడ్డల నుంచి వృద్ధుల వరకు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. తరవాత ఆలయం ముందు ఉన్న ధ్వజస్తంభం వద్ద కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు చేశారు.

పోలీసు బందోబస్తు.. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా బ్యారికేడ్లతో క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చుండూరు, వేమూరు సీఐలు శ్రీనివాసరావు, వీరాంజనేయులు సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. గ్రామస్థులు, భక్తుల ఆధ్వర్యంలో గుడి ప్రాంగణంలో రెండు విద్యుత్తు ప్రభలను ఏర్పాటు చేశారు.

13న గుళ్లపల్లి ఆనందీశ్వరుడి కల్యాణం

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని గుళ్లపల్లిలో శ్రీగంగాంబికా సమేత ఆనందీశ్వర స్వామి ఆలయంలో ఈనెల 13న స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త పొన్నపల్లి సత్యనారాయణ తెలిపారు. దేవిశరన్నవరాత్రి ఉత్సవాల అనంతరం స్వామి వారి కల్యాణం నిర్వహించడం సంప్రదాయంగా వస్తోందన్నారు. నవరాత్రుల సందర్భంగా చివరి రోజు శనివారం ఆలయంలో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం 7గంటలకు శమీపూజ వైభవంగా సాగుతుందన్నారు. స్వామికి విశేష పూజల అనంతరం నాగాభరణాలంకరణలో స్వామిని భక్తులు శుక్రవారం దర్శించుకున్నారన్నారు. అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు.



నాగాభరణాలంకరణలో ఆనందీశ్వరస్వామి

వరద బాధితులకు పరిహారం అందజేత

కొల్లూరు, న్యూస్‌టుడే: ఇటీవల సంభవించిన కృష్ణా నది వరదల ధాటికి కొల్లూరు కరకట్ట సమీపంలోని ఓ ఇటుక కల్లంలో నివాసం ఉంటున్న నాలుగు కుటుంబాలకు చెందిన పూరి గుడిసెలు కొట్టుకుపోవడంతో వారంతా చెట్టు కిందే ఆశ్రయం పొందిన విషయం తెలిసిందే. వీరి దుస్థితిపై 'ఈనాడు'లో గత నెల 29న 'వరద ఊడ్చేసింది - చెట్టే నివాసమైంది' శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. వారిలో మూడు కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. 10 వేలు చొప్పున పరిహారం శుక్రవారం అందించారు. మరో బాధితురాలికి పరిహారం అందలేదు. ఈ విషయమై తహసీల్దార్‌ను సంప్రదించగా సాంకేతిక కారణాల వల్ల ఒకట్రెండు రోజులు ఆలస్యం అయి ఉంటుందని, నగదు ఆమె బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని స్పష్టం చేశారు.



బాధితురాలు నాగమ్మకు నగదు ఇస్తున్న వీఆర్వో జగదీష్

పూర్తి స్థాయి వైద్యం అందించరూ!.. వరద ప్రవాహంలో తన నివాసంతో పాటు నగదు, బంగారు ఆభరణాలు కొట్టుకుపోవడంతో తీవ్ర మానసిక వేదనతో పక్షవాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్న ఒంటరి వృద్ధ మహిళ నాగమ్మ కొంత మేర కోలుకుంది. బాపట్లకు చెందిన 'అక్షయ హెల్పింగ్ హ్యాండ్స్' స్వచ్ఛంద సంస్థ అందించిన వైద్యసహాయం, ఆహారం ఆమెతో పాటు నివాసం ఉంటున్న మూడు బాధిత కుటుంబాల వారు మానవతా దృక్పథంతో చేసిన సేవల వల్ల ఇది సాధ్యమైంది. ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్యసహాయం అందిస్తే ఆమె పూర్తిగా కోలుకునే అవకాశం ఉందని ఈమెను పరీక్షించిన వైద్యనిపుణులు చెబుతున్నారు. దీంతో నాగమ్మకు పూర్తి స్థాయి వైద్య సహాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, రిటైల్ ధర - 147, చికెన్ విత్‌స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -125 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 248 చికెన్ స్కిన్‌లెస్ - 258.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

రామిరెడ్డిపాలెంలో కొండచిలువల సంచారం!

ఏల్చూరు (సంతమాగులూరు), న్యూస్‌టుడే: ఏల్చూరు శివారు గ్రామం రామిరెడ్డిపాలెంలో కొండచిలువల సంచారంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా ఈ ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నాయి. సమీప కొండలపై నుంచి కొండచిలువలు రామిరెడ్డిపాలెం గ్రామంలోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం వేకువజామున ఎక్స్‌ప్రెస్ రహదారి దాటుతుండగా వాహనాలు ఢీకొట్టడంతో భారీ కొండచిలువ మృతి చెందింది. ఈ ప్రాంతంలో 20 అడుగులకు పైగా పొడవున్న భారీ కొండచిలువలు సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.



నామ్ రహదారి వద్ద మృతి చెందిన కొండచిలువ

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆక్సిజన్ ట్యాంకర్..ఒకరి మృతి

మేదరమెట్ల, న్యూస్‌టుడే: రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఆక్సిజన్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందిన ఘటన కొరిశపాడు సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మేదరమెట్ల ఎస్సై మహమ్మద్ రఫీ వివరాల మేరకు.. శ్రీకాకుళం నుంచి తమిళనాడు వెళ్తున్న లారీ కొరిశపాడు సమీపంలో చెడిపోవడంతో రోడ్డు పక్కన నిలిపారు. అదే సమయంలో గుంటూరు నుంచి తడ వెళ్తున్న ఆక్సిజన్ ట్యాంకర్ రోడ్డు పక్కన నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో ట్యాంకర్ చోదకుడు దిలీప్ పాశ్వన్ (43) క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ట్యాంకర్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని బయటకు తీసేందుకు మేదరమెట్ల ఎస్సై యంత్రాలను పిలిపించి రెండుగంటలకు పైగా శ్రమించి బయటకు తీసుకు లాగారు. ఆక్సిజన్ ట్యాంకర్ ఖాళీగా ఉన్నా ఎటువంటి అగ్ని ప్రమాదం జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అగ్నిమాపక శకటాలను కూడా ప్రమాదస్థలానికి తీసుకువచ్చారు. మృతుడు బీహార్ రాష్ట్రం పట్నాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



పూర్తిగా నుజ్జయిన ట్యాంకర్ ముందు భాగం


అతివేగం రైతు ప్రాణాన్ని బలిగొంది

చోదకుడికీ తీవ్ర గాయాలు

నగరం, న్యూస్‌టుడే: అతి వేగం నిండు ప్రాణం తీసిన సంఘటన నగరం మండలంలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఎస్సై భార్గవ్ కథనం ప్రకారం... తాడివాకవారిపాలెం గ్రామానికి చెందిన తాడివాక దుర్గాప్రసాద్ (41) వరి చేలో కలుపు తీయిస్తూ నగరం-బాపట్ల రహదారి పక్కన చెట్టు కింద విశ్రాంతి తీసుకుంటుండగా బాపట్ల వైపు నుంచి వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం బలంగా ఢీకొంది. కుప్పకూలిన దుర్గా ప్రసాద్‌ను స్థానికులు నగరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య దీపిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. వేగంగా వాహనం నడిపిన ద్విచక్ర వాహన చోదకుడికి తీవ్ర గాయాలు కావడంతో బాపట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.



దుర్గాప్రసాద్ (పాతచిత్రం)


బాపట్ల: జంగాలవారివీధిలో..



బాపట్ల: రైలుపేటలో..


బాపట్ల: ఎస్ఎన్‌పీ అగ్రహారంలో..


బాపట్ల: పాండురంగ ఆలయంలో కాళికాదేవికి మహిళల పూజలు


పి.వి.పాలెం: సంగుపాలెం కోడూరులో..


అమృతలూరు: గోవాడ శైవక్షేత్రంలో..


చుండూరు: యడ్లపల్లి సొసైటీ కూడలి వద్ద..

బాపట్ల

• బాపట్ల • రేపల్లె • వేమూరు

ఏసీ బహూకరణ

భట్టిప్రోలు: గ్రామంలోని శ్రీషిర్డీసాయిబాబా దేవస్థానానికి విశ్రాంత ఉపాధ్యాయుడు బొలిశెట్టి శ్రీనివాసరావు రూ. 40వేలు విలువ కలిగిన ఏసీని దేవస్థానం కమిటీ సభ్యులకు శుక్రవారం అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపల్లెలో రంగుమారిన నీరే దిక్కు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సరఫరా అవుతున్న తాగునీరు తరచూ మురికిగా సరఫరా అవుతున్నాయి. పట్టణంలోని 22, 23, 24 వార్డుల్లో మూడ్రోజులుగా మంచినీరు రంగుమారి వస్తోంది. వాటిని తాగితే వ్యాధుల బారిన పడతామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలు ప్రాంతాల్లో కలుషితమైన నీరు తాగిన కొందరు ప్రాణాలు కోల్పోయినా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజాసంఘాలు ఆగ్రహిస్తున్నాయి. సకాలంలో నీటి పన్ను కట్టకుంటే కుళాయి కనెక్షన్ తొలగిస్తామనే అధికారులకు తాగునీటి సరఫరాపై పర్యవేక్షణ కొరవడిందని విమర్శిస్తున్నారు. పుర ప్రజలకు స్వచ్ఛమైన నీరు సరఫరా చేసేలా దృష్టిసారించాలని కోరుతున్నారు. దీనిపై ఏఈ రోహిణి మాట్లాడుతూ తాగునీరు కలుషితమై సరఫరా అవుతున్న విషయం ఎవరూ తమ దృష్టికి తీసుకు రాలేదన్నారు. ఆయా వార్డుల్లో పర్యటించి నీరు కలుషితం కావడానికి కారణం తెలుసుకుని తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


రంగు మారి సరఫరా అయిన నీరు

నగరం ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

నగరం: నగరం ఎంపీడీవోగా బొర్రా శ్రీనివాస్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇదే కార్యాలయంలో జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌గా, అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా ఆయన సేవలందించారు. ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

చోడాయపాలెం ఎస్సైగా జ్యోతి

రేపల్లె అర్బన్: రేపల్లె మండలం చోడాయపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్సైగా జి.జ్యోతి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మంగళగిరిలో సీఐడీ విభాగంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఆమె ఇక్కడకు వచ్చారు. గతంలో ఈ స్థానంలో పనిచేసిన రాజ్యలక్ష్మిని పోలీసు ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపారు.

తపాలా పథకాలపై అవగాహన

అమృతలూరు, న్యూస్‌టుడే: తపాలాశాఖ వారోత్సవాల సందర్భంగా అమృతలూరు సబ్ పోస్టాఫీస్ ఆధ్వర్యంలో తపాల పథకాలపై ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. భారత తపాలా గ్రామీణ జీవిత బీమా, సుకన్య సమృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్ తదితరాలతో ప్రజల జీవితాలకు భరోసా ఏర్పడుతుందని తెనాలి డివిజన్ సూపరింటెండెంట్ కరుణాకరబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టరు వెంకటస్వామి, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బాలలకు పుస్తకాల పంపిణీ

కర్లపాలెం: సమ సమాజ స్థాపనకు బాలికా విద్య ఎంతో తోడ్పడుతుందని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కర్లపాలెం శాఖ ఛైర్మన్ ఇనకొల్లు పోలీసురావు తెలిపారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కర్లపాలెం పంచాయతీ లంక కాలువ కట్టపై నివాసం ఉంటున్న గిరిజన బాల బాలికలకు రాతపుస్తకాలు, ఆహార పదార్థాలు అందించారు. వైస్ ఛైర్మన్ పరమానందకుమార్ పాల్గొన్నారు.

దుష్ట సంహారిణీ.. నమోస్తుతే

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం తొమ్మిదో రోజుకు చేరాయి. బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో ఆయా మండలాల్లోని ఆలయాల్లో అమ్మవారు దుష్టసంహారిణి అయిన మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దఎత్తున మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. లలితాసహస్రనామ పారాయణం చేశారు. పలు చోట్ల భక్తులకు అన్నదానం నిర్వహించారు. పిట్టలవానిపాలెం మండలం అల్లూరమ్మ ఆలయంలో భక్తులు పొంగళ్లు పొంగించారు. చెరుకుపల్లి మండలం నడింపల్లిలో గోగినేనివారి ఇలవేల్పు శ్రీరెడ్డకమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొల్లూరు శ్రీ పార్వతీ అమ్మవారికి వివిధ బంగారు, వెండి ఆభరణాలు బహూకరించిన వితరణ కర్తలను శ్రీ ఆలయ కమిటీ సత్కరించింది. కర్లపాలెం మండలం దమ్మన్నవారిపాలెం గ్రామ దేవత శ్రీనాంచారమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని గ్రామస్థులు కమల పండువగా నిర్వహించారు.

- న్యూస్‌టుడే, బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గ బృందం


పి.వి.పాలెం: అల్లూరమ్మ


చెరుకుపల్లి: కావూరులో..


చెరుకుపల్లి: నడింపల్లిలో..


కర్లపాలెం: నాంచారమ్మ


అమృతలూరు: కూచిపూడి శివాలయంలో..


వేమూరు: వలివేరులో..


నగరం: శ్రీనివాసుని ఆలయంలో కుంకుమార్చన


నగరం: చిలకాలవారిపాలెంలో..


భట్టిప్రోలులో..


రేపల్లె: పేటేరులో కాళికాదేవి


పి.వి.పాలెం: అల్లూరులో..



బాపట్ల: టౌన్‌హాలు మండపంలో అమ్మవారు, హారతి అందుకుంటున్న భక్తులు


నిజాంపట్నం: పల్లపట్లలో..


రేపల్లె రైలుపేటలో ..


చెరుకుపల్లి: గుళ్లపల్లిలో..


కొల్లూరు: అలరించిన కూచిపూడి నృత్యం



భట్టిప్రోలు: వెల్లటూరులో..



మహిషాసురమర్దినిగా చెరుకుపల్లి బాలాత్రిపురసుందరి, సామూహిక కుంకుమార్చనలో మహిళలు







విజయ దశమి శుభాకాంక్షలు

Advt Spl. Feature

శ్రీ బాలాత్రిపుర సుందరి దేవి

త్రిపురాత్రయంలో శ్రీ బాలాత్రిపురసుందరీదేవి మొదటిది. బాలాదేవి ఎంతో మహిమాన్వితమైనది. ఈమెను ధ్యానిస్తేనే దుర్గాదేవి సంతోషిస్తుంది. సకల భక్తి పూజలకీ ఉపాసనలకీ మూలమైన శ్రీ బాలాదేవి ముగ్ధమనోహరమైన జగన్మోహనాతారాన్ని పవిత్రమైన ఈ శరన్నవరాత్రులతో దర్శించి ఆమె అనుగ్రహాన్నిపొందితే సంవత్సరం పొడవునా మనం అమ్మవారికి చేసే,చేయించుకునే పూజలన్నీ సత్ఫలితాన్ని సత్కర ఫలితాన్ని ఇస్తాయని నమ్మిక, శ్రీచక్రంలో మొదటి ఆమ్నాయంలో ఉండే మొదటి దేవత బాలాదేవి

శ్రీ గాయత్రీదేవి

సకలమంత్రాలకీ మూలమైన శక్తిగా వేదమాతగాప్రసిద్ధిగాంచిన శ్రీ గాయత్రీదేవి ముక్తా, విద్రుమ, హేమ, నీల,ధవళ, వర్ణాలతో ప్రకాశిస్తూ పంచముఖాలతో దర్శనమిచ్చేసంధ్యావందన అధిష్ఠాన దేవత, శ్రీ గాయత్రీదేవి మంత్రప్రభావం ఎంతో గొప్పది. "గాయంతాం రయతీత గాయత్రి"గాఅంటూ గానం చేసేవారిని (తనరూపాన్ని)రక్షించేది అని.గాయత్రికి పేరు. అలాగే చాందోగ్యోపనిషత్తులో "వాగ్వైగాయత్రీ" అంటే మనంమాట్లాడే వాక్కే గాయత్రీ అనే అర్థం చెప్పబడింది.

శ్రీ అన్నపూర్ణాదేవి

అన్నం పరబ్రహ్మ స్వరూపం, అన్నం సర్వ జీవనాధారంఅటువంటి అన్నాన్ని ప్రసాదించేది శ్రీ అన్నపూర్ణాదేవి. నిత్యాన్నదానేశ్వరిగా నిటాలాక్షప్రాణేశ్వరిగా అన్నపూర్ణాదేవితనబిడ్డమైన మనకే గాక సకల జీవరాశులన్నింటికి ఆహారాన్నిప్రసాదిస్తుంది. ఆమెనే కాశీ అన్నపూర్ణ అని పిలుస్తారు. ఈజీవకోటి నశించిపోకుండా కాపాడుతుంది. ఇలా జీవకోటికి ఆహారాన్నందించే అన్నపూర్ణాదేవి నిజనివాసం వారణాసిక్షేత్రం.

"బిక్షాందేహి కీపావలంబన కరీ మాతా అన్నపూర్ణేశ్వరీ"







శ్రీ మహాలక్ష్మీ దేవి


శ్రీ కనకదుర్గమ్మ త్రిశక్తుల్లో ఒకటైన మహాలక్ష్మి స్వరూపిణి 1.సత్యలక్ష్మి, 2. భోగలక్ష్మి, 3.రాజ్యలక్ష్మి, 4. యోగలక్ష్మి, 5.విద్యాలక్ష్మి, 6.సౌభాగ్యలక్ష్మి, 7.అమృతలక్ష్మి 8.కామ్యలక్ష్మి అనేఎనిమిది విధాలుగా మహాలక్ష్మీదేవి కనిపిస్తుంది. అంతేకాదు, 1.ధనలక్ష్మి, 2. ధాన్యలక్ష్మి, 3. ధైర్యలక్ష్మి, 4.విజయలక్ష్మి, 5.ఆదిలక్ష్మి, 6. విద్యాలక్ష్మి, 7. గజలక్ష్మి, 8.సంతానలక్ష్మి, అనిమరొక ఎనిమిది రకాల అష్టలక్ష్ములు కూడా లోకంలో ప్రసిద్ధమయ్యాయి. దుర్గమ్మఆలయ కుడ్యాలలో అష్టలక్ష్మి విగ్రహాలను అందంగా ప్రతిష్ఠించారు.

శ్రీ సరస్వతీ దేవి (మూలానక్షత్రం)

చదువుల తల్లి సరస్వతీదేవి మానవులకు సకలవిద్యలనూప్రసాదించి వారిలో జ్ఞానదీపాన్ని వెలిగించే విద్యాశక్తి, సరస్వతిఅమ్మవారి జన్మనక్షత్రమైన మూల నక్షత్రం రోజున చేసేఅలంకారానికే ఎక్కువ ప్రాధాన్యత ఏర్పడింది. ఆ కారణంగాలక్షలాది మంది ప్రజలు అమ్మను దర్శించి ఆమె అనుగ్రహాన్నికొనుకగా తీసుకువెళ్లాలని ఆశతో వస్తారు. ప్రభుత్వం వారుమూలనక్షత్రం రోజున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

శ్రీ లలితా త్రిపురసుందరీదేవి

త్రిపురాత్రయంలో రెండవ శక్తి ఈ లలితాదేవి బ్రహ్మ, విష్ణు,మహేశ్వరుల కన్నా పూర్వం నుంచి ఉన్నది. కాబట్టిత్రిపురసుందరి అని పిలువబడుతోంది. ఈ లలితాత్రిపురసుందరి శ్రీ చక్ర అధిష్ఠానశక్తిగా, పంచదశాక్షరి మహామంత్రాధిప దేవతగా తనను కొలిచే భక్తులను ఉపాసకుల్నిఅనుగ్రహిస్తుంది. శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలోఆదిశంకరాచార్యచే ప్రతిష్ఠితమైన శ్రీ చక్ర మహాయంత్రం ఏదైతే వుందో, ఆశ్రీచక్రానికి అధిష్ఠాన దేవత కూడా ఈ లలితా త్రిపుర సుందరీదేవే.







శ్రీ దుర్గాదేవి (దుర్గాష్టమి)

అశ్వయుజ శుద్ధ అష్టమి నాడు అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా అలంకరిస్తారు. దుర్గతుల్ని నాశనం చేసిదుర్గాదేవి " దుఃఖేన గుంతు శక్యతే ఇతి దుర్గా" అనిఅంటారు. అటువంటి శక్తి స్వరూపిణి దుర్గాదేవి అష్టమి తిథిరోజున రురుకుమారుడైన దుర్గముడు అనే రాక్షసుణ్ణిసంహరించింది. కాబట్టే లోకంలో దుర్గా అని కీర్తించబడింది.ఆ అష్టమి దుర్గాష్టమి అని ప్రసిద్ధి పొందింది. మహాకాళి,మహాసరస్వతి, మహాలక్ష్మిలకు దుర్గాదేవిని మూలపుటమ్మగా తొలుస్తారు.

శ్రీ మహిషాసురమర్దినీదేవి


మహిషాసురుడి వల్ల తీవ్రమైన కష్టాలు పడుతున్న ఇంద్రాది దేవతలంతా తమ తమ శరీరాల్లోంచి దివ్య తేజస్సుల్ని బైటికి ప్రసరించారు. ఆ తేజస్సులన్నీ కలిసిపోయి ఒక దివ్య తేజోమూర్తి పుట్టింది. ఆతేజోమూర్తికి వివిధ దేవతలంతా తమ తమ ఆయుధాల్ని సమర్పించారు. హిమవంతుడు తనవంతుగా ఒకసింహాన్ని ఆ తల్లికి వాహనంగా ఇచ్చాడు. అలా సింహవాహినిగా రూపొందిన ఆ శక్తి వికటాట్టహాసం చేసి, మహిషాసురుడి సేనావతులైన రాక్షసులందరినీ సంహరించింది. ఆ తరువాత యుద్ధంలో దేవి అవలీలగా మహిషాసురుణ్ణి సంహరించి అదే స్వరూపంతో ఇంద్రకీలాద్రిమీద వెలిశారు.

శ్రీ రాజరజేశ్వరి దేవి

అశ్వయుజ శుద్ధ దశమి రోజున అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరీదేవిగా అలంకరిస్తారు. మహాత్రిపుర సుందరి, శ్రీచక్రఅధిష్ఠాన దేవత ఈమె. శ్రీ లలితాదేవినే రాజరాజేశ్వరిగాకొలుస్తారు. పరమశాంత స్వరూపంతో చిరునవ్వులు చిందిస్తూఇక్షు ఖండాన్ని (చెరకుగడ)చేతిలో ధరించి ఒకచేత అభయముద్రను చూపిస్తూ దర్శనమిస్తుంది. అపరాజితాదేవి స్వరూపమైన రాజరాజేశ్వరీదేవిని దర్శించినవారికి అపజయమే ఉండదని నమ్మిక.

"చిద్రూపి పరదేవత భగవతి శ్రీ రాజరాజేశ్వరి"





వైకాపాను చిత్తుగా ఓడిస్తేనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

బాపట్ల, న్యూస్‌టుడే: రానున్న ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెదేపా-జనసేన-భాజపా కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించి శాసనమండలికి పంపించాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కోరారు. తెదేపా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. డిగ్రీ, డిప్లొమా, ఉన్నత చదువులు పూర్తి చేసిన వారు ఈనెల 31 లోగా పట్టభద్రుల ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కూటమి పార్టీల ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ఓటరు నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఎన్నికలోనూ వైకాపాను చిత్తుగా ఓడిస్తేనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. సీఎం చంద్రబాబు చొరవతో రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, రూ.వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ఎమ్మెల్సీగా రాజేంద్రప్రసాద్‌ను గెలిపించుకోవటానికి కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా శ్రమిస్తామన్నారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతిని అడ్డుకోవటానికి వైకాపా చేస్తున్న కుట్రలను ఓటు ద్వారా పట్టభద్రులు తిప్పికొట్టాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, తెలుగు మహిళ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మానం విజేత, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పమిడి భాస్కరరావు, భాజపా జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, జనసేన జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసికుమారి, తెదేపా పరిశీలకుడు సాంబిరెడ్డి, నేతలు పల్లం సరోజని, గొలపల శ్రీనివాసరావు, యేపూరి భూపతిరావు, షేక్ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ పూజకు వేళాయె



పూజకు సిద్ధం చేసిన ఆయుధాలు

బాపట్ల, న్యూస్‌టుడే: విజయదశమి అంటేనే అందరికీ ఆయుధ పూజ గుర్తుకు వస్తుంది. మన పూర్వీకుల నుంచి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం వీరోచిత ఆయుధాలను వినియోగిస్తున్నారు. మన నిత్య జీవన గమనంలో ఇతోధికంగా సాయపడే యంత్రాలు, సామగ్రి, వాహనాలు.. మన విజయానికి ఉపయోగపడే వస్తువులు..మనం వచ్చే గౌరవం, కృతజ్ఞతను సూచికగా ఏటా దసరా రోజు ఆయుధ పూజ నిర్వహించటం సంప్రదాయంగా వస్తోంది. శక్తి స్వరూపిణి అయిన దుర్గామాతకు ఆయుధ పూజ నిర్వహిస్తే విజయాలు దక్కుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

విరాటపర్వంలో నాంది!.. పాండవులు విరాటపర్వం ముగింపు సందర్భంగా విజయదశమి రోజున జమ్మి చెట్టుపై ఉంచిన ఆయుధాలను దించి పూజలు చేసి వినియోగించారని మహాభారతంలో పేర్కొన్నారు. అప్పటి నుంచి ఆయుధ పూజ సంప్రదాయం ప్రారంభమైందని వేద పండితులు చెబుతున్నారు.

తుపాకులను

అలంకరించి.. విజయదశమి సందర్భంగా జిల్లాలో 32 పోలీస్‌స్టేషన్లు, సాయుధ విభాగం కేంద్రంలో పోలీసులు దుర్గాదేవి విగ్రహం ఎదుట తుపాకులను అందంగా అలంకరించి ఉంచారు. వాహనాలను శుభ్రం చేసి అలంకరించి విజయాలు చేకూర్చాలంటూ పోలీసు అధికారులు ఆయుధ పూజ నిర్వహిస్తున్నారు. పూజలో ఎస్పీ, అదనపు ఎస్పీ, డీఎస్పీ, సీఐలు పాల్గొననున్నారు. జిల్లాలో బాపట్ల, రేపల్లె, చీరాల, అద్దంకి ఆర్టీసీ డిపోల్లో ఆయుధ పూజ జరుగుతోంది.

వాహనాలకూ.. ప్రజలు దసరా పర్వదినం రోజు వాహనాన్ని శుభ్రంగా కడిగి పసుపు, కుంకుమ రాసి పూలు, నిమ్మకాయలతో అలంకరించి ఆలయానికి వెళ్లి తమ ప్రయాణాలు విజయవంతంగా, సురక్షితంగా పూర్తి కావాలని, వ్యాపారాలు బాగా సాగి లాభాలు రావాలని ఆయుధపూజ ప్రత్యేక పూజలు చేస్తారు. దుర్గాదేవి, ఆంజనేయస్వామి, శివాలయాల్లో దసరా రోజున ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, లారీలకు వాహన పూజలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ప్రముఖ ఆలయాల్లోనీ వాహన పూజలతో శనివారం కిటకిట లాడనున్నాయి. ఆక్వా ప్రాసెసింగ్ కంపెనీల్లో యంత్రాలు, వాహనాలకు పూజలు నిర్వహించి కార్మికులు, ఉద్యోగులు సామూహిక భోజనాలు చేస్తున్నారు.

తటాకాలు కాదు.. వరి పొలాలే

నియోజకవర్గంలో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. కర్లపాలెం మండలం యాజలి, దుండివారిపాలెం, తిమ్మారెడ్డిపాలెంలో రబీలో వేరుసెనగ, పచ్చిమిర్చి సాగుకు సిద్ధం చేసిన పంట భూముల్లో భారీగా నీరు నిలిచి తటాకాలను తలపించాయి. తీరానికి తుపాను ముప్పు ఉందని, ఈ నెల 14 నుంచి 16 వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.



ఈ నేపథ్యంలో రైతులు పంటలు దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు. రబీలో పంటల సాగు విత్తనాలు చల్లటానికి సిద్ధమైన సాగుదారులు వారం రోజులు ఆగాలని భావిస్తున్నారు.

- న్యూస్‌టుడే, బాపట్ల

రాష్ట్రస్థాయి పోలురాధ ఎడ్లపోటీలు ప్రారంభం



పోటీలు జరుగుతున్న దృశ్యం

కొత్తపేట (వేటపాలెం), న్యూస్‌టుడే: దసరా సందర్భంగా శ్రీచెన్నకేశవ స్వామి, శీతాలాంబ ఆశీస్సులతో రాష్ట్రస్థాయి పోలురాధ ఎడ్ల పోటీలు శుక్రవారం కొత్తపేట పంచాయతీ ప్రసాద్ నగరంలో ప్రారంభించారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాలకు చెందిన 20 ఎడ్ల జతలు వచ్చాయి. బండి మీద 1.50 క్వింటా బరువు చేసి పదినిమిషాల వ్యవధిలో ఎక్కువ దూరం వెళ్లిన జతకు ప్రథమ బహుమతి అందజేస్తారు. పోటీలు తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో అన్నదాతలు, ఎడ్ల పోషకులు వచ్చారు.

ప్రభుత్వ పాఠశాలను తెరిపించండి

ప్రకాశం జిల్లా పెద్దివారిపాలెం గ్రామస్థులు వినతి

తాడేపల్లి, న్యూస్‌టుడే: తొమ్మిది దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలను వైకాపా ప్రభుత్వం మూసివేసిందని దానిని తిరిగి తెరిపించాలని బాపట్ల జిల్లా పర్చూరు మండలం తూర్పు పెదవారిపాలెం, యద్దనపూడి మండలం పడమర పెదవారిపాలెం గ్రామస్థులు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆయా గ్రామాల ప్రజలు వినతిపత్రాలను అందజేశారు. పాఠశాల మూసివేయడం వల్ల గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. వైకాపా ప్రభుత్వం తమ పిల్లలకు విద్యను దూరం చేసిందన్నారు. పాఠశాల తెరిపించి తమ చిన్నారులకు విద్యను అందించాలని కోరారు.

స్పీకర్ ఓంప్రకాష్‌తో ఎంపీ తెన్నేటి భేటీ

బాపట్ల: కొత్త దిల్లీలోని పార్లమెంటు భవనంలో స్పీకర్ ఓంప్రకాష్ బిర్లాను ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్యానల్ స్పీకర్‌గా వ్యవహరిస్తున్న తెన్నేటి పలు పార్లమెంటరీ అంశాలపై స్పీకర్‌తో చర్చించినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత

నగరం: హత్యా రాజకీయాలు సమాజానికి మంచివి కావని వైకాపా జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున అన్నారు. మండల పరిధిలోని దాసరిపాలెం గ్రామంలో ఇటీవల హత్యకు గురైన నున్నా భూషయ్య కుటుంబానికి పార్టీ తరపున రూ.5లక్షల చెక్కును ఈవూరి గణేష్ చేతుల మీదుగా శుక్రవారం అందించారు.

రేపల్లెలో 135 దరఖాస్తులు

రేపల్లె అర్బన్: రేపల్లె ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో రేపల్లె పట్టణ, రేపల్లె, భట్టిప్రోలు మండలాల్లో 12 మద్యం దుకాణాల ఏర్పాటుకు 135 దరఖాస్తులు దాఖలైనట్లు సీఐ రౌతు దివాకర్ శుక్రవారం తెలిపారు. రేపల్లె 3, రేపల్లె మండలం 4, భట్టిప్రోలు మండలం 5 మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రేపల్లె 44, రేపల్లె మండలం 38 భట్టిప్రోలు మండలంలో 53 దరఖాస్తులు రాగా ప్రభుత్వానికి రూ. 2.70 కోట్ల ఆదాయం సమకూరిందని సీఐ తెలిపారు.

300 క్వింటాళ్ల బియ్యం సీజ్

కళ్యాపురం(జే.పంగులూరు), న్యూస్‌టుడే : జే పంగులూరులోని ఓ రైస్‌మిల్లులో నిల్వ ఉన్న 300 క్వింటాళ్ల బియ్యాన్ని జిల్లా పౌరసరఫరా అధికారులు సీజ్ చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని కళ్యాపురం గ్రామ పరిధిలోని రైస్ మిల్లుపై పౌరసరఫర శాఖ జిల్లా అధికారి విలియమ్స్‌తో పాటు ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులు శుక్రవారం దాడి చేశారు. ఈ సమయంలో అక్కడ ఉన్న 300 క్వింటాళ్ల బియ్యంను గుర్తించారు. అయితే అక్కడ నిల్వ ఉన్నవి రేషన్ బియ్యం కాదని, రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం తాలూకు బియ్యంగా రైస్ మిల్లు నిర్వాహకులు వివరించారు. అనుమానించిన అధికారులు.. బియ్యం నిల్వలను సీజ్ చేసి నమూనాలు తీసుకెళ్లారు. ఈ విషయమై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విలియమ్స్ విలేకరులతో మాట్లాడుతూ సీజ్ చేసిన బియ్యం నమూనాను ప్రయోగశాలకు పంపామని, ఫలితాలు రాగానే చర్యలు తీసుకుంటామని వివరించారు.

క్రైమ్ కార్నర్

చోరీపై ఫిర్యాదు చేయటానికి వచ్చిన మెకానిక్‌పై దాడి..!

బాపట్ల, న్యూస్‌టుడే: తన దుకాణంలో రూ.లక్షల విలువైన విడి భాగాలు చోరీ అయ్యాయని మోటార్ సైకిల్ మెకానిక్ రవి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయటానికి వస్తే ఎస్సై, పోలీసు సిబ్బంది దౌర్జన్యానికి పాల్పడ్డారని బాధితుడు వాపోయాడు. తన దుకాణంలో చోరీ జరిగిందని రవి మూడ్రోజులుగా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నాడు. ఫిర్యాదు ఇచ్చినా పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఈ నేపథ్యంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మెకానిక్ తన ఫిర్యాదును ఎందుకు పట్టించుకోవటం లేదని గట్టిగా ప్రశ్నించాడు. దీంతో ఎస్సై ఆగ్రహంతో తనను అసభ్య పదజాలంతో దూషించించారని రవి వాపోయాడు. ఎస్సై ఆదేశాలతో కానిస్టేబుల్ తనపై దాడి చేశాడని ఆవేదన వ్యక్తం చేశాడు. విషయం తెలిసి పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చిన విలేకరులపైనా ఎస్సై దురుసుగా ప్రవర్తించారు. దీనిపై పట్టణ సీఐ అహ్మద్ జానీకి ఫిర్యాదు చేసినట్లు బాధితుడు రవి తెలిపారు. పట్టణ సీఐను సంప్రదించగా మెకానిక్‌పై దాడి జరగలేదన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

కొల్లూరు, న్యూస్‌టుడే: స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో ఓ గ్రామానికి చెందిన అవివాహిత యువతి తెనాలి వెళ్లొస్తానని ఇంటి నుంచి బయల్దేరి మూడ్రోజులైనా తిరిగి రాక పోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈనెల 8న ఆమె ఆర్టీసీ బస్సులో తెనాలి చేరుకుంది. అదే రోజు సాయంత్రంతల్లికి ఫోన్ చేసి తాను ఇంటికి రావడం ఆలస్యం అవుతుందని చెప్పింది. తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. దీంతో కుటుంబసభ్యులు పలు చోట్ల గాలించినా ఫలితం లేక పోలీసులను ఆశ్రయించారు. అదృశ్యమైన యువతి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై ఏడుకొండలు కేసు నమోదు చేశారు.

చిలుమూరులో చోరీ

కొల్లూరు, న్యూస్‌టుడే: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తమ ఇంటి కిటికీ గ్రిల్స్ తొలగించి, బీరువాలో ఉన్న వెండి ఆభరణాలు చోరీ చేశారని, వీటి విలువ సుమారు రూ. 25 వేలు ఉంటుందని చిలుమూరుకు చెందిన దొప్పలపూడి ఆనందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై అర్జున్ శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. వివరాల్లోకెళితే.. విజయవాడలో నివాసం ఉంటున్న ఫిర్యాదుదారు తల్లిదండ్రులు చిలుమూరులో ఉండే వారు. ఆరోగ్య సమస్యలతో కొన్ని రోజులుగా గుంటూరులోని కుమార్తె ఇంటి వద్ద ఉంటున్నారు. దీనిని అదనుగా భావించిన ఆగంతకులు చోరీకి పాల్పడ్డారు.

రెండు ఇసుక ట్రాక్టర్లపై కేసు

కొల్లూరు, న్యూస్‌టుడే: పెసర్లంక సమీపంలో కృష్ణా నది నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్ గణేష్ కేసు నమోదు చేశారు.


చెడుపై మంచి సాధించిన విజయం
ఈ ఎన్నికల్లో మన విజయమే సాక్ష్యం
విజయదశమి ఈ సాంప్రదాయ పండుగ, చెడుపై మంచి సాధించిన ఘన విజయానికి చిహ్నం. ఈ సంవత్సరం జరిగిన ఎన్నికల్లో కూటమి పార్టీ సాధించిన విజయం, ఈ పండుగకు మరింత ప్రాముఖ్యత చేకూరుస్తోంది. ప్రజల మద్దతు, నాయకత్వం, మరియు సంకల్పం ఈ విజయానికి బలమైంది. ఈ విజయవంతమైన దారిలో మనందరం పునః ఆశాజనకంగా ముందుకు సాగుదాం. దుర్మార్గాలను పారద్రోలుతూ, మంచి మార్గంలో దేశాన్ని నడిపే ప్రయత్నంలో కూటమి పార్టీ అగ్రగామిగా నిలవడం మనందరికీ గర్వకారణం.
ఈ విజయదశమి అందరికీ మంచి జరగాలి ఆ దుర్గాదేవి కృపా కటాక్షాలు మందందరికీ దక్కాలి.
జిల్లా కలెక్టర్ గారికి, జాయింట్ కలెక్టర్ గారికి,
SP గారికి, ప్రభుత్వ అధికారులకు, ఉద్యోగులకు మరియు
బాపట్ల నియోజకవర్గ ప్రజలందరికీ
దసరా మరియు దీపావళి శుభాకాంక్షలు
వేగేశన నరేంద్ర వర్మ, శాసన సభ్యులు
బాపట్ల నియోజకవర్గం


విజయదశమి శుభాకాంక్షలు
అనునిత్యం మా వెంట ఉండి
వెన్నుతట్టి నడిపిస్తున్న
చీరాల నియోజకవర్గ అభివృద్ధి కాముకులు,
మా ప్రియతమ శాసనసభ్యులు
శ్రీ మద్దులూరి మాలకొండయ్య గారికి
మరియు చీరాల నియోజకవర్గ
ప్రజలకు, అధికారులకు,
టిడిపి, జనసేన, బిజేపి
కూటమి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు
విజయదశమి శుభాకాంక్షలు
యం.అమర్‌నాథ్
టి.డి.పి. యువనాయకులు
యం.మహేంద్రనాథ్
చీరాల నియోజకవర్గ టి.డి.పి. అధికార ప్రతినిధి
యం.యం.కొండయ్య
శాసనసభ్యులు, చీరాల నియోజకవర్గం
చీరాల నియోజకవర్గ తెలుగుదేశం-జనసేన-బిజేపి పార్టీల కూటమి

చీరాల

•చీరాల •అద్దంకి •పర్చూరు

జాతీయ రహదారి వెంట తుమ్మచెట్లు తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

చినగంజాం, న్యూస్‌టుడే: రోడ్డుకు ఇరు వైపులా ఉన్న తుమ్మచెట్లు కొమ్మలు 216 జాతీయ రహదారిపై రావడంతో ఆ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 30న ఈనాడులో 'నిర్వహణే మరిచారా' శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన హైవే రీజనల్ అధికారి సుధీర్, సూపర్‌వైజర్ షేక్ మున్నా హైవే రోడ్డులోని రొంపేరు కాలువ వంతెన మలుపు వద్దతో పాటు మండల పరిధిలోని రోడ్డు వెంట తుమ్మచెట్లను మూడు రోజులుగా పూర్తిగా తొలగించినట్లు వారు తెలిపారు.

15న మండల సర్వసభ్య సమావేశం

కారంచేడు(మార్టూరు), న్యూస్‌టుడే: కారంచేడు మండల సర్వసభ్య సమావేశం 15న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నేతాజీ తెలిపారు. ఎంపీపీ ఆధ్యక్షతన మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

ల్యాప్‌టాప్ అందజేత

తిమిడెదపాడు (ఇంకొల్లు), న్యూస్‌టుడే: గుంటూరు మానవత స్వచ్ఛంద సంస్థ తిమిడెదపాడుకు చెందిన పేద విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేసింది. గ్రామానికి చెందిన ఎంసీఏ చదువుతున్న కందుకూరి దుర్గాప్రసాద్‌కు సంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు విద్యార్థినికి రూ.70వేల విలువచేసే ట్యాప్‌ట్యాప్‌ను శుక్రవారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు.

రహదారిపై నీటి నిల్వ అరికట్టేదెప్పుడో?



మండల కేంద్రమైన వేటపాలెం పంచాయతీ కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలోని రహదారిపై చిన్నపాటి వర్షం కురిసినా రోజుల తరబడి నీరు నిలిచిపోతున్నాయి. దీంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దంగా సమస్య ఉన్నా నేటికి పరిష్కారం కాకపోవడం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి నిత్యం రద్దీగా ఉండే దారిలో నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, వేటపాలెం**

వ్యాఘ్ర వాహిని.. మహిషాసురమర్దిని



పాపరాజుతోటలో.. మార్టూరులో.. ఇంకొల్లులో.. మేదరమెట్లలో.. కారంచేడులో. ఈపురుపాలెం పందిరి వద్ద.. ముప్పవరంలో.. రేణంగివరంలో.. సోపిరాలలో..

దసరా ఉత్సవాలు వాడవాడలా వైభవంగా జరుగుతున్నాయి. తొమ్మిదోరోజు శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దిని దేవిగా పూజలందుకున్నారు. పలు ఆయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో వీటిని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అద్దంకి మండలం గోవాడలో గ్రామ వాస్తవ్యులు పావులూరి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన కార్యసిద్ధి అభయాంజనేయస్వామి విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించనున్నారు. **-న్యూస్‌టుడే బృందం**



ధన్వంతరి పూజకు హాజరైన ప్రజలు



ఆలయం వద్ద నిర్వహిస్తున్న కుంకమపూజ

బాలికలను ప్రోత్సహిద్దాం



నంబూరిపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద బాలికలతో సిబ్బంది

యద్దనపూడి, న్యూస్‌టుడే: గ్రామాల్లో బాలికలను రక్షించి.. వారిని ఉన్నతంగా ఎదిగేలా తోడ్పాటు అందించాలని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు సీహెచ్.సుజాత కోరారు. మండలంలోని జాగర్లమూడిలో అంతర్జాతీయ బాలికా దినోత్సవ సందర్భంగా శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించి మానవహారంగా ఏర్పడి బాలికల ఉన్నతికి అందరూ తోడ్పాటుగా నిలవాలని పిలుపునిచ్చారు.

అద్దంకి, న్యూస్‌టుడే : బాలికలను ప్రోత్సహించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.రమాదేవి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పట్టణం లోని నంబూరిపాలెం వద్ద కార్యక్రమం నిర్వహించారు.

రామాలయం హుండీలో నగదు చోరీ

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: మండలంలోని బోడవాడలోని రామాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీ తాళాలు పగులగొట్టి నగదు దోచుకెళ్లిన సంఘటన జరిగింది. గురువారం అర్ధరాత్రి ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. హుండీ తాళాలు పగులగొట్టిన ఆనవాళ్లను గ్రామస్థులు గుర్తించినట్లు వెల్లడించారు. కొద్దిరోజుల క్రితం ఇదే గ్రామంలోని మరో ఆలయం వద్ద ఆకతాయిలు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన విషయాన్ని బోడవాడ వాసులు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు హుండీ దొంగలపై ప్రత్యేక దృష్టి సారించి, చోరీలు అదుపు చేయాలని కోరుతున్నారు.

పోలేరమ్మ ఆలయంలో..

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: మండలంలోని చెరుకూరు సమీపంలోని కొత్తపాలెం పోలేరమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగులగొట్టినట్లు గ్రామస్థులు శుక్రవారం తెలిపారు. హుండీలో నగదు మొత్తం తీసుకెళ్లినట్లు భావిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

విజయ దశమి శుభాకాంక్షలు

Advt Spl. Feature

శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవి



త్రిపురాత్రయంలో శ్రీ బాలాత్రిపురసుందరీదేవి మొదటిది. బాలాదేవి ఎంతో మహిమాన్వితమైనది. ఈమెను ధ్యానిస్తేనేదుర్గాదేవి సంతోషిస్తుంది. సకల భక్తి పూజలకీ ఉపాసవలకీమూలమైన శ్రీ బాలాదేవి ముగ్ధమనోహరమైన జగన్మోహనాతారాన్నిపవిత్రమైన ఈ శరన్నవరాత్రులతో దర్శించి ఆమె అనుగ్రహాన్నిపొందితే సంవత్సరం పొడవునా మనం అమ్మవారికి చేసే,చేయించుకునే పూజలన్నీ సత్ఫలితాన్ని సత్కర ఫలితాన్ని ఇస్తాయని నమ్మిక, శ్రీచక్రంలో మొదటి అమ్నాయంలో ఉండే మొదటి దేవత బాలాదేవి

శ్రీ గాయత్రీదేవి



సకలమంత్రాలకీ మూలమైన శక్తిగా వేదమాతగాప్రసిద్ధిగాంచిన శ్రీ గాయత్రీదేవి ముక్తా, విద్రుమ, హేమ, నీల,ధవళ, వర్ణాలతో ప్రకాశిస్తూ పంచముఖాలతో దర్శనమిచ్చేసంధ్యావందన అధిష్ఠాన దేవత, శ్రీ గాయత్రీదేవి మంత్రప్రభావం ఎంతో గొప్పది. "గాయంతాం రయతీత గాయత్రి"గాఅంటూ గానం చేసేవారిని (తనరూపాన్ని)రక్షించేది అని.గాయత్రికి పేరు. అలాగే చాందోగ్యోపనిషత్తులో "వాగ్వైగాయత్రీ" అంటే మనంమాట్లాడే వాక్కే గాయత్రి అనే అర్థం చెప్పబడింది.

శ్రీ అన్నపూర్ణాదేవి



అన్నం పరబ్రహ్మ స్వరూపం, అన్నం సర్వ జీవనాధారంఅటువంటి అన్నాన్ని ప్రసాదించేది శ్రీ అన్నపూర్ణాదేవి. నిత్యాన్నదానేశ్వరిగా నిటాలాక్షప్రాణేశ్వరిగా అన్నపూర్ణాదేవితనబిడ్డలైన మనకే గాక సకల జీవరాశులన్నింటికి ఆహారాన్నిప్రసాదిస్తుంది. ఆమెనే కాశీ అన్నపూర్ణ అని పిలుస్తారు. ఈజీవకోటి నశించిపోకుండా కాపాడుతుంది. ఇలా జీవకోటికి ఆహారాన్నందించే అన్నపూర్ణాదేవి నిజనివాసం వారణాసిక్షేత్రం.

"భిక్షాందేహి కృపావలంబన కరీ మాతా అన్నపూర్ణేశ్వరీ"

శ్రీ మహాలక్ష్మీ దేవి



శ్రీ కనకదుర్గమ్మ త్రిశక్తుల్లో ఒకటైన మహాలక్ష్మి స్వరూపిణి 1.సత్యలక్ష్మి, 2. భోగలక్ష్మి, 3.రాజ్యలక్ష్మి, 4. యోగలక్ష్మి, 5.విద్యాలక్ష్మి, 6.సౌభాగ్యలక్ష్మి, 7.అమృతలక్ష్మి 8.కామ్యలక్ష్మి అనేఎనిమిది విధాలుగా మహాలక్ష్మీదేవి కనిపిస్తుంది. అంతేకాదు, 1.ధనలక్ష్మి, 2. ధాన్యలక్ష్మి, 3. ధైర్యలక్ష్మి, 4.విజయలక్ష్మి, 5.ఆదిలక్ష్మి, 6. విద్యాలక్ష్మి, 7. గజలక్ష్మి, 8.సంతానలక్ష్మి, అనిమరొక ఎనిమిది రకాల అష్టలక్ష్ములు కూడా లోకంలో ప్రసిద్ధమయ్యాయి. దుర్గమ్మఆలయ కుడ్యాలలో అష్టలక్ష్మి విగ్రహాలను అందంగా ప్రతిష్ఠించారు.

శ్రీ సరస్వతీ దేవి (మూలానక్షత్రం)



చదువుల తల్లి సరస్వతీదేవి మానవులకు సకలవిద్యలనూప్రసాదించి వారిలో జ్ఞానదీపాన్ని వెలిగించే విద్యాశక్తి, సరస్వతిఅమ్మవారి జన్మనక్షత్రమైన మూల నక్షత్రం రోజున చేసేలలంకారానికే ఎక్కువ ప్రాధాన్యత ఏర్పడింది. ఆ కారణంగాలక్షలాది మంది ప్రజలు అమ్మను దర్శించి ఆమె అనుగ్రహాన్నికొనుకగా తీసుకువెళ్లాలని ఆశతో వస్తారు. ప్రభుత్వం వారుమూలనక్షత్రం రోజున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

శ్రీ లలితా త్రిపురసుందరీదేవి




త్రిపురాత్రయంలో రెండవ శక్తి ఈ లలితాదేవి బ్రహ్మ, విష్ణుమహేశ్వరుల కన్నా పూర్వం నుంచి ఉన్నది. కాబట్టిత్రిపురసుందరి అని పిలువబడుతోంది. ఈ లలితాత్రిపురసుందరి శ్రీ చక్ర అధిష్ఠానశక్తిగా, పంచదశాక్షరి మహామంత్రాధిఏ దేవతగా తనను కొలిచే భక్తులను ఉపాసకుల్ని అనుగ్రహిస్తుంది. శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలోఆదిశంకరాచార్యచే ప్రతిష్ఠితమైన శ్రీ చక్ర మహాయంత్రం ఏదైతే వుందో, ఆశ్రీచక్రానికి అధిష్ఠాన దేవత కూడా ఈ లలితా త్రిపుర సుందరీదేవే.

శ్రీ దుర్గాదేవి (దుర్గాష్టమి)



అశ్వయుజ శుద్ధ అష్టమి నాడు అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా అలంకరిస్తారు. దుర్గతుల్ని నాశనం చేసిదుర్గాదేవి " దుఃఖేన గుంతు శక్యతే ఇతి దుర్గా" అనిఅంటారు. అటువంటి శక్తి స్వరూపిణి దుర్గాదేవి అష్టమి తిథిరోజున రురురుపూరుడైన దుర్గముడు అనే రాక్షసుణ్ణిసంహరించింది. కాబట్టే లోకంలో దుర్గా అని కీర్తించబడింది.ఆ అష్టమి దుర్గాష్టమి అని ప్రసిద్ధి పొందింది. మహాకాళి,మహాసరస్వతి, మహాలక్ష్మిలకు దుర్గాదేవిని మూలపుటమ్మగా తొలుస్తారు.

శ్రీ మహిషాసురమర్దినీదేవి



మహిషాసురుడి వల్ల తీవ్రమైన కష్టాలు పడుతున్న ఇంద్రాది దేవతలంతా తమ తమ శరీరాల్లోంచి దివ్య తేజస్సుల్ని బైటికి ప్రసరించారు. ఆ తేజస్సులన్నీ కలిసిపోయి ఒక దివ్య తేజోమూర్తి పుట్టింది. ఆతేజోమూర్తికి వివిధ దేవతలంతా తమ తమ ఆయుధాల్ని సమర్పించారు. హిమవంతుడు తనవంతుగా ఒకసింహాన్ని ఆ తల్లికి వాహనంగా ఇచ్చాడు. అలా సింహవాహినిగా రూపొందిన ఆ శక్తి వికటాట్టహాసం చేసి, మహిషాసురుడి సేనావతులైన రాక్షసులందరినీ సంహరించింది. ఆ తరువాత యుద్ధంలో దేవి అవలీలగా మహిషాసురుణ్ణి సంహరించి అదే స్వరూపంతో ఇంద్రకీలాద్రిమీద వెలిశారు.

శ్రీ రాజరాజేశ్వరి దేవి



అశ్వయుజ శుద్ధ దశమి రోజున అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరీదేవిగా అలంకరిస్తారు. మహాత్రిపుర సుందరి, శ్రీచక్రఅధిష్ఠాన దేవత ఈమె. శ్రీ లలితాదేవినే రాజరాజేశ్వరిగాకొలుస్తారు. పరమశాంత స్వరూపంతో చిరునవ్వులు చిందిస్తూఇక్షు ఖండాన్ని (చెరకుగడ)చేతిలో ధరించి ఒకచేత అభయముద్రను చూపిస్తూ దర్శనమిస్తుంది. అపరాజితాదేవి స్వరూపమైన రాజరాజేశ్వరీదేవిని దర్శించినవారికి అపజయమే ఉండదని నమ్మిక.

"చిద్రూపి పరదేవత భగవతి శ్రీ రాజరాజేశ్వరి"

చీరాల

•చీరాల •అద్దంకి •పర్చూరు



గంగవరం ఆర్అండ్‌బీ రహదారిలో నిలిచిన వర్షం నీరు

ఇంకొల్లులో భారీ వర్షం

ఇంకొల్లు: ఉపరితల ఆవర్తనం కారణంగా ఇంకొల్లు పరిసర గ్రామాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు విడతల వారీగా వర్షం కురుస్తోంది. ఓవైపు ఎండ అంతలోనే వర్షం. ప్రస్తుతం మిరప, పొగాకు నాట్లు వేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. వర్షం కారణంగా నారుమళ్లు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ఏలూరి శుభాకాంక్షలు

మార్టూరు, న్యూస్‌టుడే : నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఆ మేరకు ఆయన క్యాంపు కార్యాలయ వర్గాలు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చీకటిపై వెలుగు సాధించిన విజయమే ఈ పండుగ అన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి నిలుస్తుందన్నారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో మెలగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

గ్రామీణులు తపాలా సేవలు వినియోగించుకోవాలి

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: గ్రామీణప్రాంత ప్రజలు తపాలా శాఖ సేవలను వినియోగించుకోవాలని ఆ శాఖ ఏఎస్‌పీవో జీ. శ్రీనివాసరావు కోరారు. పర్చూరులో తపాలా శాఖ అందిస్తున్న సేవలపై స్థానికులను అవగాహన కల్పించారు. అధికారి కె. వీరబ్రహ్మాచారి, సీహెచ్. రమణ, హెచ్ఎం రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణాలు ఎప్పుడు పూర్తయ్యేనో!

అయిదేళ్లుగా లబ్ధిదారుల ఎదురుచూపులు

అద్దంకి, న్యూస్‌టుడే

పేదవాడి సొంతింటి కల నెరవేర్చేందుకు గత తెదేపా ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో టిడ్కో గృహనిర్మాణ సముదాయం ఏర్పాటు చేసింది. 2019లో అధికారం చేపట్టిన వైకాపా ప్రభుత్వం వీటిని పూర్తిగా విస్మరించింది. టిడ్కో గృహ నిర్మాణాలకు ఒక్క రూపాయి విదిల్చిన దాఖలాలు లేవు. ఫలితంగా ఐదేళ్ల నుంచి టిడ్కో బహుళ అంతస్తు భవనాలు తుది మెరుగుల కోసం ఎదురు చూస్తున్నాయి. అద్దంకి పురపాలక సంఘం అధీనంలో సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో 936 టిడ్కో ఇళ్లు నిర్మించారు. తుదిమెరుగులు దిద్దే సమయానికి రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం వచ్చింది. ఫలితంగా అప్పటి నుంచిఐ టిడ్కో గృహనిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.

అద్దంకిలో రూ.82 కోట్లతో అంచనా

అద్దంకి పట్టణ పరిధిలో టిడ్కో గృహాల నిర్మాణాలకు సంబంధించి రూ.82 కోట్లతో పనులు ప్రారంభించారు.



శింగరకొండ సమీపంలోని టిడ్కో ఇళ్లు

ఇందులో గృహ నిర్మాణాలకు రూ.67కోట్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.15 కోట్లు అవసరంగా భావించారు. రూ.42.95 కోట్లతో గృహ నిర్మాణాల పనులు జరగ్గా గుత్తేదారుకు రూ.25.31 కోట్లు ఇచ్చారు. ఇంకా రూ.17.64 కోట్లు చెల్లించాల్సి ఉంది. మౌలిక సదుపాయాలైన రహదారులకు రూ.8 కోట్లు, విద్యుత్తు ఉప కేంద్రం రూ.4 కోట్లు, ఎస్‌టీపీకు (సీపేజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) రూ.3 కోట్లు వెరసి రూ.15 కోట్లు అంచనాలకు గాను మూడు కోట్లు చెల్లించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తిరిగి టిడ్కో లబ్ధిదారుల ఆశలు చిగురించాయి. అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులు పూర్తి చేసి ఇళ్ల తాళాలు అందిస్తారని భావిస్తున్నారు. తదనుగుణంగా మౌలిక సదుపాయాల పనులు ప్రారంభించారు. విద్యుత్తు ఉప కేంద్రం, ఎస్‌టీపీ, రహదారుల పనులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై టిడ్కో ఏఈ నాగేశ్వరరావును వివరణ కోరగా మరో వారం రోజుల్లో నిధుల విడుదలకు అవకాశం ఉందన్నారు. వచ్చిన వెంటనే పనులు పూర్తిచేసి ఇళ్లను లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో 1,331 దరఖాస్తులు

చీరాల అర్బన్, మార్టూరు, అద్దంకి, న్యూస్‌టుడే: చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లోని మద్యం దుకాణాలకు శుక్రవారం రాత్రి 7గం వరకు 1331 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. చీరాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న చీరాల, వేటపాలెం, చినగంజాం, కారంచేడు మండలాల్లోని 24 దుకాణాలకు 432 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ పేరం నాగేశ్వరరావు తెలిపారు. వీటి వల్ల ప్రభుత్వానికి రూ.8.64 కోట్లు వచ్చిందన్నారు. అత్యధికంగా కారంచేడులోని రెండు దుకాణాల్లో ఒకదానికి 30, ఇంకొదానికి 27, చీరాల మున్సిపల్ పరిధిలో అత్యల్పంగా రెండు దుకాణాలకు 13 చొప్పున దరఖాస్తులు వచ్చాయన పేర్కొన్నారు.

★ పర్చూరు నియోజకవర్గంలోని 20 దుకాణాలకు 548 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా ఇంకొల్లు మండలంలోని మూడు దుకాణాల కోసం వ్యాపారులు తీవ్రంగా పోటీపడడంతో 137 దరఖాస్తులు వెల్లువెత్తాయి. మార్టూరు మండలంలోని 6 షాపులకు 190, పర్చూరు మండలంలోని 4 షాపులకు 77, యద్దనపూడి ప్రాంతంలోని రెండు దుకాణాల కోసం 41 అప్లికేషన్లు, చినగంజాంలోని 3 దుకాణాల కోసం 46 మంది టెండర్లు వేసినట్లు పర్చూరు, చీరాల అబ్కారి శాఖ అధికారులు భుజంగరావు, నాగేశ్వరరావు వెల్లడించారు.

★ అద్దంకి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని 23 దుకాణాలకు 351 దరఖాస్తులు అందాయి. అద్దంకి పట్టణంలో ఐదు దుకాణాలకు-83, గ్రామీణంలోని రెండు దుకాణాలకు-17, బల్లికురవలో నాలుగు దుకాణాలకు 57, సంతమాగులూరులో ఐదు దుకాణాలకు-56, కొరిశపాడులో నాలుగు దుకాణాలకు-71, జే.పంగులూరులో మూడు దుకాణాలకు-67 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సీఐ భవానీ తెలిపారు.

పొంగిన వాగులు.. నిలిచిన రాకపోకలు



స్వర్ణ- తిమిడెదపాడు గ్రామాల మధ్య చప్టాపై పొంగి ప్రవహిస్తున్న వరద నీరు

కారంచేడు (మార్టూరు), కారంచేడు, న్యూస్‌టుడే: ఎగువ నుంచి ప్రవహిస్తున్న వరదనీటి తాకిడికి వప్పలవాగుపై వరదనీరు చేరడంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. కారంచేడు మండలం స్వర్ణ- తిమిడెదపాడు మధ్య, పోతినవారిపాలెం గ్రామాల సమీపంలోని వాగులోకి భారీగా వరదనీరు చేరింది. దీంతో వివిధ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు ప్రమాదాలు జరగకుండా పహారా ఏర్పాటు చేశారు. యద్దనపూడి మండలంలోని పర్చూరు వాగులో వరదనీరు ఉద్ధృతి తీవ్రంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఎగువ నుంచి వరదనీటి ప్రవాహం పెరగడంతో పోలూరు, చిలుకూరివారిపాలెం గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ వంతెనపై వరదనీరు చేరుతుందని అంచనా వేస్తున్నారు.

ఆ రహదారిలో అడుగడుగునా గండమే



గురిజేపల్లి (సంతమాగులూరు), న్యూస్‌టుడే: అద్దంకి నియోజకవర్గం, సంతమాగులూరు మండలం యాటీ నుంచి గురిజేపల్లి వెళ్లే మార్గంలోని రహదారి దుస్థితి ఇది. గురిజేపల్లి పరిధిలో గ్రానైట్ గనులు, పాలిషింగ్ యూనిట్లు ఉన్నాయి. నిత్యం వందల సంఖ్యలో భారీ గ్రానైట్ రాళ్లు, పాలిషింగ్ పలకలతో టర్బో లారీలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటాయి. 50 టన్నుల పరిమాణం ఉన్న వాహనాలు మాత్రమే ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే వీలుంది. కానీ భారీ గ్రానైట్ రాళ్లతో, గ్రానైట్ పలకలతో వంద నుంచి 150 టన్నుల బరువున్న టర్బో లారీలు ఈ మార్గం గుండా నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో తారు రహదారి ఛిద్రమవుతోంది. తాత్కాలిక మరమ్మతులు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. గుంతల మయంగా ఉన్న ఒకే వరస రహదారిలో ద్విచక్ర వాహనదారులకు, బాటసారులకు ప్రయాణం అడుగడుగునా గండంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో భారీ వాహనాలు తిరిగేందుకు వీలుగా పటిష్టంగా నిర్మాణం చేసి శాశ్వత పరిష్కారం చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గురిజేపల్లి,(సంతమాగులూరు)**

హక్కులను నియంత్రించడం అన్యాయం

వేటపాలెం, న్యూస్‌టుడే: బాలికల హక్కులు నియంత్రించి వారి భవిష్యత్తును పరిమితం చేయడం అన్యాయమని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ పీడీ కె.ఉమ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఆధ్వర్యంలో మండల పరిషత్తు సముదాయంలోని స్త్రీ శిశు సంక్షేమశాఖ భవనంలో శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జరిగిన సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు ఆడబిడ్డను బతికిద్దాం.. చదివిద్దాం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లలు ఇంటికి ఒక కళ అని, వీరి భవిష్యత్తు ప్రకాశవంతంగా ఉండాలంటే చిన్ననాటి నుంచి విద్యపై దృష్టి సారించేలా ప్రోత్సహించాలని పీడీ పేర్కొన్నారు. ఐసీడీఎస్ పర్యవేక్షకులు సునంద, పుష్పవల్లి, లీలావతి, కార్యకర్తలు ఉన్నారు.

తెలుగు మాధ్యమం ప్రవేశపెట్టాలి

చీరాల, న్యూస్‌టుడే : తెలుగు మీడియం లేనందున చాలా మంది విద్యార్థులు చదువుకు దూరం అయ్యారని ప్రభుత్వం స్పందించి జీవో 117 రద్దు చేసి తెలుగు మాధ్యమం ప్రవేశపెట్టాలని జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు పేర్కొన్నారు. స్థానిక ఎన్జీవో భవనంలో శుక్రవారం జిల్లా స్థాయి జన విజ్ఞాన వేదిక కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్యను ఉన్నత విద్యలో విలీనం చేయటం వల్ల అనేక మంది బడి మానేశారన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన అనాలోచిత విధానాలను రద్దు చేయాలని కోరారు. జిల్లా స్థాయి చెకుముకి ప్రతిభా పరీక్ష పోటీలు ఈనెల 27న దేశాయిపేటలోని ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యా, వైద్యం, సాంస్కృతిక, పర్యావరణం, సైన్స్, సాంకేతికత, ఆరోగ్యం వంటి అంశాలపై చర్చించి ఆయా రంగాలలో జిల్లా కన్వీనర్లను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.భాస్కరరావు, టి.శ్రీనివాసరావు, కోశాధికారి మాల్యాద్రి పాల్గొన్నారు.

గంజాయి వినియోగదారుల అరెస్టు

అద్దంకి, న్యూస్‌టుడే : అద్దంకి పట్టణంలో గంజాయి వినియోగిస్తున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీఐ పి.కృష్ణయ్య అందించిన సమాచారం మేరకు ఈనెల 3న అద్దంకిలో జరిగిన గంజాయి విక్రయం, వినియోగానికి సంబంధించిన అంశంపై నలుగురు నిందితుల్ని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పర్చగా రిమాండ్ విధించారు. ఈ కేసు విచారణలో భాగంగా గంజాయి వినియోగిస్తున్న అద్దంకికి చెందిన కెఎస్ఎస్‌వీ కిషోర్ బాబు, డి.గోపీ, ఎం.సీహెచ్.రెడ్డి, హనీఫ్, సాయితో పాట మరో ఇద్దరు మైనర్లను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ వెల్లడించారు.